తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :81 | 09-10-2026 | శుక్రవారం | పేజీలు: 4 | వెల:03/-


## డీబీటీతో రూ.5 లక్షల కోట్ల లీకేజీకి అడ్డుకట్ట

### భారత్ వినియోగదారు నుంచి సృష్టికర్తగా ఎదుగుతోంది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: డిజిటల్ ఇండియా కార్యక్రమంతో దేశంలో డిజిటల్ విభజనను తగ్గించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మొబైల్ ఫోన్ కేవలం సమాచార మార్పిడి సాధనంగా కాకుండా.. పాలన, ప్రజలకు సేవల అందజేతలో కీలక సాధనంగా మారిందని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 10వ ఎడిషన్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.
డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా ఇప్పటివరకు రూ.50 లక్షల కోట్లకు పైగా నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు మోదీ తెలిపారు. ఈ విధానం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్ల నిధులు అనర్హుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరేలా డిజిటల్ వ్యవస్థలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.
డిజిటల్ కనెక్టివిటీ విస్తరణతో దేశంలో సాంకేతికత

మిగతా వివరాలు రెండో పేజీలో..

# ఏఐపై కేంద్రం కొత్త నియంత్రణలు

### డీప్‌ఫేక్‌లు, సైబర్ మోసాలకు చెక్.. నెలలోపు సంప్రదింపుల పత్రం




న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దాని నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. దేశంలో ఏఐ వినియోగానికి సమగ్ర నియంత్రణ వ్యవస్థను రూపొందించే దిశగా ముందుకు సాగుతున్నట్లు కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సంప్రదింపుల పత్రాన్ని నెలలోపు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఏఐ ద్వారా అందుతున్న ప్రయోజనాలతో పాటు దాని వల్ల తలెత్తుతున్న కొత్త సవాళ్లను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ వీడియోలు, తప్పుడు సమాచార వ్యాప్తి, సైబర్ మోసాలు, వ్యక్తిగత గోప్యతకు ముప్పు వంటి అంశాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఏఐ వ్యవస్థలు ప్రజల జీవితాల్లో మరింతగా భాగమవుతున్న నేపథ్యంలో భద్రత, మానవ సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది.

కొత్త నియంత్రణ విధానంలో అధిక ప్రమాదం కలిగించే ఏఐ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉంది. స్వయంప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకునే ఏఐ వ్యవస్థలు, కృత్రిమంగా రూపొందించిన కంటెంట్ వంటి వాటికి సంబంధించి బాధ్యతను ఎలా నిర్ణయించాలన్న అంశంపైనా చర్చ జరగనుంది. ఏఐ ద్వారా రూపొందించిన సమాచారానికి ఎవరు బాధ్యత వహించాలి, దాని దుర్వినియోగాన్ని ఎలా అరికట్టాలి అనే అంశాలు కూడా కీలకం కానున్నాయి.

ఇప్పటివరకు ఏఐకు సంబంధించిన కొన్ని అంశాలను విడివిడిగా నియంత్రించే విధానాలకే పరిమితమైన కేంద్రం.. ఇప్పుడు మరింత సమగ్ర వ్యవస్థను రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. ఏఐ సంస్థలు, సాంకేతిక నిపుణులు, పరిశ్రమ వర్గాలు, ఇతర

మిగతా వివరాలు రెండో పేజీలో..

## సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

### కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: హరీష్‌రావు




హైదరాబాద్: సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు.
సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన బకాయిలు, సంక్షేమ అంశాలను పరిష్కరించడంతో పాటు సంస్థకు రావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు.
కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా వివరాలు రెండో పేజీలో..

## ఈసీకి విశ్రాంత న్యాయమూర్తుల మద్దతు

### రాజ్యాంగ సంస్థలను కించపరచొద్దు.. 42 మంది విశ్రాంత జడ్జీల బహిరంగ లేఖ




న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు, పలు వర్గాల నుంచి నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో 42 మంది విశ్రాంత న్యాయమూర్తులు ఈసీకి మద్దతుగా బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థతో పాటు ఇతర రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేలా జరుగుతున్న ప్రచారంపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, అందులో ఎన్నికల సంఘం కేంద్రంగా మారిందని పేర్కొన్నారు.
ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ సంస్థలను విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే వాటిని కించపరచడం లేదా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని విశ్రాంత న్యాయమూర్తులు స్పష్టం చేశారు. సంస్థలను 'దొంగలు', 'తోలుబొమ్మలు', 'రాజీపడినవారు' వంటి పదాలతో అభివర్ణించడం ప్రజల్లో రాజ్యాంగ వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణపై వస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను కూడా వారు ప్రస్తావించారు. ఇలాంటి ఆరోపణలకు ఆధారాలు ఉంటే

మిగతా వివరాలు రెండో పేజీలో..

## పాక్ పెంచిన ఉగ్రవాదమే పాక్‌ను వెంటాడుతోంది

### ఐరాస వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర విమర్శలు



న్యూయార్క్: పాకిస్థాన్ గతంలో పెంచి పోషించిన ఉగ్రవాద వ్యవస్థ ఇప్పుడు అదుపు తప్పి ఆ దేశాన్నే వెంటాడుతోందని ఐరాస వేదికగా భారత్ తీవ్రంగా విమర్శించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే దేశంగా, బాధిత దేశంగా పాకిస్థాన్ తనను తాను చిత్రీకరించుకుంటోందని.. అదే సమయంలో తన భూభాగం నుంచి పనిచేసిన ఉగ్రవాద సంస్థల విషయంలో వాస్తవాలను దాచిపెడుతోందని భారత్ ఆరోపించింది.
ఐరాస జనరల్ అసెంబ్లీ ఆరో కమిటీ సమావేశంలో భారత్ తరఫున ఫస్ట్ సెక్రటరీ

మిగతా వివరాలు రెండో పేజీలో..

## నానా పటేకర్ కన్నుమూత

### 75 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి..

### కార్గిల్ యుద్ధ సమయంలో సైనికులతో 60 రోజులు



ప్రముఖ బాలీవుడ్ నటుడు, దర్శకుడు నానా పటేకర్ కన్నుమూశారు. 75 ఏళ్ల వయసున్న ఆయన గురువారం తెల్లవారుజామున గోవాలోని డోనా పౌలాలో తన నివాసంలో అస్వస్థతకు గురయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా

మిగతా వివరాలు రెండో పేజీలో..

## జీఎస్‌టీ అధికారుల అరెస్టు అధికారం రద్దు

### ప్రాసిక్యూషన్ పరిమితి రూ.5 కోట్లకు పెంపు.. రేట్లలో మార్పులేవు



న్యూఢిల్లీ: జీఎస్‌టీ వ్యవస్థలో పన్ను చెల్లింపుదారులకు ఊరట కలిగించే కీలక నిర్ణయాలను 57వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జీఎస్‌టీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. రేట్ల నిర్మాణం ఇప్పటికే స్థిరపడినందున

మిగతా వివరాలు 3వ పేజీలో..

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TGTEL/25/A0871
TELANGANAVENNELA WAKKU



# పితృపక్షాల్లో కాకికే పిండం ఎందుకు పెడతారు..?



పితృపక్షాలు వచ్చాయంటే కొన్ని ఇళ్లలో ఒక దృశ్యం కనిపిస్తుంది. పిండం పెట్టి, అన్నం వండి, కాకి కోసం ఎదురుచూస్తుంటారు. కాకి వచ్చి తింటే పితృదేవతలు స్వీకరించినట్టుగా భావిస్తారు. కాకి రాకపోతే మాత్రం ఏదో లోపం జరిగిందేమోనని ఆందోళన చెందుతారు. అసలు పితృకర్మలో కాకికి ఇంత ప్రాధాన్యం ఎందుకు వచ్చింది? కాకి వచ్చి తినడమే పితృదేవతలు ఆహారం స్వీకరించినట్లు అర్థమా?

హిందూ పితృకర్మ సంప్రదాయంలో కాకికి ప్రత్యేకమైన ప్రతీకాత్మక స్థానం ఉంది. పితృదేవతలకు సమర్పించిన ఆహారాన్ని కాకి స్వీకరించడాన్ని పితృసంతృప్తికి సంకేతంగా భావించే ఆచారం అనేక ప్రాంతాల్లో ఉంది. అందుకే పితృపక్షాల్లో కాకికి ఆహారం పెట్టడం సాధారణంగా కనిపిస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. కాకి అనేది పితృదేవతే అని శాస్త్రీయంగా చెప్పడం కాదు. కాకి రావడం, రాకపోవడం ఆధారంగా పితృదేవతలు సంతోషంగా ఉన్నారా లేదా కోపంగా ఉన్నారా అని నిర్ణయించడానికి కూడా ఆధారం లేదు. ఇది పితృకర్మలో ఏర్పడిన ఒక ధార్మిక సంకేతం. పితృదేవతలను స్మరించి సమర్పించిన ఆహారాన్ని ఒక జీవికి అందించడం ద్వారా కృతజ్ఞత, సమర్పణ భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయంగా దీనిని చూడాలి.

మరి కాకినే ఎందుకు ఎంచుకున్నారు? భారతీయ సంప్రదాయంలో కాకి పితృదేవతలతో అనుసంధానించబడిన పక్షిగా చాలాకాలంగా భావించబడింది. పితృకర్మకు సంబంధించిన అనేక ఆచారాల్లో కాకికి ఆహారం సమర్పించే పద్ధతి కనిపిస్తుంది. అందువల్ల పితృపక్షాల్లో కాకి కనిపిస్తే అది సాధారణ పక్షి వచ్చిందనే దానికంటే, పితృస్మరణకు సంబంధించిన ఒక సంకేతంగా భక్తులు భావిస్తారు.

కానీ కాకి రాకపోతే భయపడాల్సిన అవసరం లేదు. ఆ రోజు కాకి ఆకలిగా లేకపోవచ్చు, పరిసరాల్లో లేకపోవచ్చు, మనుషుల కదలికల వల్ల దగ్గరకు రాకపోవచ్చు. దాన్ని పితృదేవతల అసంతృప్తికి సంకేతంగా భావించడం సరైనది కాదు. పితృకర్మలో ప్రధానమైనది కాకి తినడమా లేదా అన్నది కాదు.. శ్రద్ధతో నిర్వహించే కర్మ, పితృస్మరణ, తర్పణం, సమర్పణ భావం.

అందుకే పితృపక్షాల్లో కాకికి అన్నం పెట్టేటప్పుడు ఒక ఆసక్తికరమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనం కాకికి ఆహారం పెడుతున్నామని కనిపించినా, ఆ చర్య వెనుక ఉన్నది పితృదేవతల స్మరణ. కాకి తిన్నదా లేదా అనే దానికంటే, పితృదేవతలను శ్రద్ధగా స్మరించామా అన్నదే ఈ ఆచారం చెప్పే అసలు భావం.

పితృపక్షాల్లో కాకి కోసం ఎదురుచూసే ఆ క్షణం కూడా ఒక ప్రత్యేకమైన ధార్మిక భావనను కలిగిస్తుంది. మన కళ్ల ముందు కనిపించేది ఒక చిన్న పక్షి.. కానీ మనసులో గుర్తుకొచ్చేది మాత్రం మనకు జన్మనిచ్చిన వారు, మనకు మార్గం చూపిన వారు, మన కంటే ముందుగా వెళ్లిపోయిన వారు. అందుకే కాకికి పెట్టే ఆ ఒక్క ముద్ద అన్నం వెనుక పితృస్మరణకు ఇంత ప్రాధాన్యం వచ్చింది.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# రాజ్యాంగ మూలస్తంభానికే ముప్పు!

## సుప్రీంకోర్టు సంచలనం ఎటు దారితీస్తోంది?



భారత ప్రజాస్వామ్య వ్యవస్థ సుదీర్ఘ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ముందు ఒక తీవ్రమైన, సంచలనాత్మక రాజ్యాంగ సవాలు నిలిచింది. దేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలను నిర్వహించాల్సిన అత్యున్నత రాజ్యాంగ సంస్థ భారత ఎన్నికల సంఘం. అటువంటి పవిత్రమైన సంస్థకు సారథ్యం వహిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇతర కమిషనర్ల నియామక ప్రక్రియనే నేరుగా సవాలు చేస్తూ, వారు ఏ అధికారంతో ఆ కుర్చీల్లో కూర్చున్నారో వివరణ ఇవ్వాలంటూ 'కో వారెంటో' రిట్ జారీ చేయాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడం తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. అసలు ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఉన్నతాధికారులపై ఈ స్థాయి 'కో వారెంటో' ప్రయోగించాల్సిన దుస్థితి ఎందుకు వచ్చింది? మన ప్రజాస్వామ్య మూలాలు అంతర్గతంగా క్షీణిస్తున్నాయనడానికి ఇది ఒక స్పష్టమైన ప్రమాద హెచ్చరిక కాదా?

గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపిక ప్యానెల్‌లో ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలని స్పష్టం చేసింది. కానీ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆ ప్యానెల్ నుంచి తొలగించి, ప్రధాని సూచించిన మరొక కేంద్ర మంత్రిని సభ్యుడిగా చేర్చారు. అంటే, ఎంపిక ప్రక్రియ సంపూర్ణంగా కార్యనిర్వాహక వర్గం చేతుల్లోకే వెళ్లిపోయింది. ఒక వైపు ప్రభుత్వాన్ని ఎన్నుకునే పవిత్రమైన ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే కమిషన్‌ను, అదే ప్రభుత్వం తనకు అనుకూలంగా ఎంపిక చేసుకునే నిరంకుశ అవకాశం రావడం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం కాదా? ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలవాల్సిన స్వతంత్ర సంస్థలను ప్రభుత్వం తన గుప్పెట్లో ఉంచుకోవాలని చూడటం ఏ రకమైన న్యాయం?

ఈ సంచలన పిటిషన్‌లో వ్యక్తమైన ప్రధాన ఆందోళన నియామకాల ప్రాతిపదిక, పారదర్శకత మరియు అర్హతలు. చట్ట ప్రకారం ఎంపిక ప్యానెల్ రూపకల్పన జరిగిందా, లేదా అభ్యర్థుల అర్హతలను, నిబంధనలను పక్కనబెట్టి అత్యవసరంగా ఈ నియామకాలను పూర్తి చేశారా అన్న సందేహాలు నింగిని తాకుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల రూపకల్పనపై మరియు నిరుద్యోగ సమస్యలపై సామాన్య ప్రజల నుంచి, జెన్ జెడ్ యువత నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ 'కో వారెంటో' పిటిషన్ రావడం దేశ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థల సారథుల నియామకంలో పారదర్శకత లేకపోతే రేపు జరగబోయే ఎన్నికల ఫలితాలను ప్రజలు ఎలా విశ్వసిస్తారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. కార్యనిర్వాహక వర్గం తన రాజకీయ స్వప్రయోజనాల కోసం రాజ్యాంగ సంస్థల స్వాతంత్ర్యాన్ని హరిస్తుంటే న్యాయవ్యవస్థ దీనికి ఎలా కడివాళం వేయబోతోందో వేచి చూడాలి. ఒకవేళ 'కో వారెంటో' రిట్ ద్వారా సుప్రీంకోర్టు ఈ నియామక వ్యవహారాన్ని లోతుగా విచారించి రద్దు చేస్తే, రాజ్యాంగపరంగా ఏర్పడే తీవ్ర పరిణామాలకు మరియు సంక్షోభానికి బాధ్యులెవరనేది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయమే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీ నుంచి తొలగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసిందనే ఆరోపణలకు ప్రభుత్వం వద్ద ఉన్న సమాధానమేమిటో కూడా తక్షణమే స్పష్టం కావాల్సి ఉంది.

శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ పరిధులను దాటి ప్రవర్తిస్తున్నప్పుడు న్యాయవ్యవస్థ మాత్రమే చివరి ఆశాకిరణంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు ఎంత పవిత్రమైనదో, ఆ ఓట్లను లెక్కించి విజేతలను నిర్ణయించే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత కూడా అంతే పవిత్రమైనది. ఆ నిష్పాక్షికతకే మచ్చపడేలా నియామకాలు సాగాయని కోర్టు మెట్లు ఎక్కడం అనేది పాలకులకు కన్నువిప్పు కలగాల్సిన అంశం.

భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు ఇప్పుడు సుప్రీంకోర్టు తీసుకోబోయే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. రాజ్యాంగ వ్యవస్థల పవిత్రతను, ప్రజల నమ్మకాన్ని కాపాడటంలో ఏ చిన్న విలంబం జరిగినా అది దేశాన్ని పూడ్చలేని రాజ్యాంగ సంక్షోభానికి గురిచేస్తుంది. అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యవహారంలో త్వరిత గతిన స్పందించి, ఎన్నికల కమిషనర్ల నియామకాలపై వస్తున్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రమాణాలను పునరుద్ధరించాల్సిన చారిత్రక బాధ్యత ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# డీబీటీతో రూ.5 లక్షల కోట్ల లీకేజీకి అడ్డుకట్ట

అందుబాటు మరింత పెరిగిందని ప్రధాని తెలిపారు. గతంలో ఆధునిక సాంకేతికత కొంతమందికే అందుబాటులో ఉండేదని.. డిజిటల్ ఇండియా ద్వారా పరిస్థితిని మార్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మొబైల్ సేవలు, చౌకైన డేటా, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

భారత్ ఇక సాంకేతికతను వినియోగించే దేశంగానే కాకుండా.. ఉత్పత్తులు, డిజైన్లు, సాంకేతికత, మేధో సంపత్తిని సొంతంగా అభివృద్ధి చేసే సృష్టికర్తగా ఎదుగుతోందని మోదీ అన్నారు. టెలికాం రంగంలో సంస్కరణలు, దేశీయ తయారీ, కొత్త సాంకేతికతల అభివృద్ధి ద్వారా స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. భారత్‌లో సెమీకండక్టర్ వాణిజ్య ఉత్పత్తి ఇప్పటికే ఐదు ప్రాంతాల్లో ప్రారంభమైనట్లు వెల్లడించారు.

సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌ల ముప్పు దేశ సరిహద్దులకు పరిమితం కాదని ప్రధాని పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ మోసాలు ప్రజలకు చేరకముందే అడ్డుకునేలా ప్రపంచస్థాయి వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఫోన్, నెట్‌వర్క్ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

# సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి లాభాలు తగ్గాయని హరీష్‌రావు ఆరోపించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీష్‌రావు విమర్శించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సంస్థకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

ఇదిలా ఉండగా, ఈ నెల 14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన నిర్వహించనున్నట్లు హరీష్‌రావు ప్రకటించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడంతో పాటు కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# పాక్ పెంచిన ఉగ్రవాదమే పాక్‌ను వెంటాడుతోంది

రఘూ పూరి ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ సృష్టించి, ఆ తర్వాత నియంత్రణ కోల్పోయిన ఉగ్రవాద సంస్థలు ఒకప్పుడు పొరుగు దేశాల్లో విధ్వంసం సృష్టించాయని.. ఇప్పుడు అదే ఉగ్రవాదం పాకిస్థాన్‌లోనూ హింసకు కారణమవుతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి ఆర్థిక సహాయం, శిక్షణ, ఆశ్రయం లేదా ఇతర సహకారం అందించే దేశాలపై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగ్రవాదంపై పాకిస్థాన్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని రఘూ పూరి విమర్శించారు. ఒకవైపు ఉగ్రవాదంపై పోరాడుతున్న దేశంగా చెప్పుకొంటూనే.. మరోవైపు ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చిన చరిత్రను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఉగ్రవాదాన్ని కేవలం ప్రకటనలతో అరికట్టలేమని, దాని వెనుక ఉన్న ఉగ్రవాదులు, నిర్వాహకులు, ఆర్థిక సహాయకులు, ప్రోత్సాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

పాకిస్థాన్ రాజకీయ నాయకులే ఆ దేశంలో ఉగ్రవాద ముప్పు పెరుగుతున్న విషయాన్ని అంగీకరించిన సందర్భాలను కూడా భారత్ ప్రస్తావించింది. పాకిస్థాన్ తన సరిహద్దుల వెలుపల ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. అదే సమయంలో తాను బాధిత దేశమని చెప్పుకోవడం విరుద్ధమైన వైఖరని పేర్కొంది. ఉగ్రవాదంపై అంతర్జాతీయ సమాజం మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భారత్ ఐరాసలో పిలుపునిచ్చింది.

భారత్--పాకిస్థాన్ మధ్య ఉగ్రవాదంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐరాస వేదికగా తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ ఆరోపణలకు స్పందించిన పాకిస్థాన్ ప్రతినిధి కూడా భారత్‌పై ప్రత్యారోపణలు చేశారు. దీంతో ఆరో కమిటీ సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉగ్రవాద అంశంపై తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

# నానా పటేకర్ కన్నుమూత

ఆయన మృతి చెందినట్లు మణిపాల్ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసినప్పటికీ ఆయనను కాపాడలేకపోయారు.నానా పటేకర్ మరణంతో హిందీ, మరాఠీ చిత్ర పరిశ్రమల్లో విషాదం నెలకొంది. 'పరిందా', 'క్రాంతివీర్', 'అగ్నిసాక్షి', 'ప్రహార్', 'వెల్‌కమ్' తదితర చిత్రాల్లో తనదైన శైలిలో నటించి ఆయన ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశారు. ఉత్తమ నటుడిగా, సహాయ నటుడిగా సహా మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్న ఆయనకు 2013లో పద్మశ్రీ కూడా లభించింది.అయితే నటుడిగా మాత్రమే కాకుండా దేశభక్తి, సైనికుల పట్ల ఉన్న గౌరవంతోనూ నానా పటేకర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1999 కార్గిల్ యుద్ధ సమయంలో సైనికులతో కలిసి పనిచేసిన విషయం ఆయన జీవితంలోని ఆసక్తికరమైన అధ్యాయం. అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌ను సంప్రదించి యుద్ధ సమయంలో సైనికులతో కలిసి ఉండేందుకు అనుమతి తీసుకున్నారు. అంతకుముందు 'ప్రహార్' సినిమా కోసం మరాఠా లైట్ ఇన్‌ఫెంట్రీతో సైనిక శిక్షణ పొందిన అనుభవం ఆయనకు ఉంది.కార్గిల్ యుద్ధ సమయంలో సుమారు 60 రోజుల పాటు సైనికులతో కలిసి ఉన్నట్లు నానా పటేకర్ గతంలో వెల్లడించారు. ద్రాస్, లేహ్, కుప్వారా, బారాముల్లా, సోపోర్ తదితర ప్రాంతాల్లో సైనికులతో కలిసి పనిచేసిన ఆయన అనంతరం క్విక్ రియాక్షన్ టీమ్‌లోనూ భాగమయ్యారు. అక్కడ తాను చేసిన విధుల పూర్తి వివరాలను మాత్రం భద్రతా కారణాలతో వెల్లడించలేదు. ఆ సమయంలో సుమారు 76 కిలోల బరువుతో వెళ్లి తిరిగి వచ్చేసరికి 56 కిలోలకు తగ్గినట్లు ఆయన గతంలో చెప్పారు.నానా పటేకర్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అసాధారణ ప్రతిభ, ప్రత్యేకమైన నటనా శైలి, ప్రతి పాత్రలో చూపిన సృజనాత్మకతను మోదీ కొనియాడారు. నానా పటేకర్ మరణం భారతీయ సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

# ఏఐపై కేంద్రం కొత్త నియంత్రణలు

భాగస్వాములతో సంప్రదింపులు జరిపి నూతన విధానాన్ని రూపొందించనున్నారు. సాంకేతిక అభివృద్ధికి ఆటంకం కలగకుండా భద్రతకు తగిన ప్రాధాన్యం ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం విస్తరిస్తున్న తరుణంలో భారత్ కూడా తన నియంత్రణ విధానాన్ని స్పష్టంగా రూపొందించుకునే దిశగా కదులుతోంది. ఏఐను ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించడంతో పాటు దాని ద్వారా వచ్చే ముప్పులను ముందుగానే గుర్తించి నియంత్రించాల్సిన అవసరం ఉందని కేంద్రం చెబుతోంది. రానున్న సంప్రదింపుల పత్రం ద్వారా ఏఐ నియంత్రణపై దేశంలో విస్తృత చర్చకు అవకాశం ఏర్పడనుంది.

# ఈసీకి విశ్రాంత న్యాయమూర్తుల మద్దతు

వాటిని బహిరంగ సభలు, విలేకరుల సమావేశాలకే పరిమితం చేయకుండా తగిన ఆధారాలతో న్యాయస్థానాల ముందు ఉంచాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు పెంచడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కూడా విశ్రాంత న్యాయమూర్తులు సమర్థించారు. చట్టబద్ధమైన ప్రక్రియలో భాగంగానే ఓటర్ల జాబితాలను సవరించడం జరుగుతోందని, జాబితాలను మరింత కచ్చితంగా రూపొందించేందుకు ఇటువంటి ప్రక్రియలు అవసరమని వారు పేర్కొన్నారు. ఎన్నికలపై లేదా సంస్థల నిర్ణయాలపై అభ్యంతరాలు ఉన్నవారు రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, మీడియా, ప్రజలు సంయమనం పాటించాలని వారు కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని పేర్కొంటూ, ఆధారాలు లేని ఆరోపణలను ప్రచారం చేయకుండా వాస్తవాలను

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు




నిర్మల్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిలువుటద్దమైన పూల పండుగ బతుకమ్మ వేడుకలు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ డి. హేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు తీరొక్క రంగురంగుల ప్రకృతి పూలతో ఆకర్షణీయమైన బతుకమ్మలను రూపొందించారు. సంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ జానపద గీతాలు ఆలపించారు, కోలాట నృత్యాలతో అలరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ ప్రకృతిని, పుడమి తల్లిని పూలతో పూజించే అరుదైన గొప్ప సంస్కృతి ఒక్క తెలంగాణలోనే ఉందని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ ముందంజ వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అత్యుత్తమ బతుకమ్మలను తీర్చిదిద్దిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినులు, అధ్యాపకులకు సంప్రదాయ సత్తుపిండి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సూర్యసాగర్, డాక్టర్ పి.జి. రెడ్డి, డాక్టర్ టి. శ్రీనివాస్, అర్చన, డాక్టర్ రజిత, రమేష్ రెడ్డి, కుంట శ్రీహరి, దిలీప్, డాక్టర్ రంజిత్, నరేందర్ మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి




నిర్మల్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి విద్యా ప్రమాణాలను గణనీయంగా పెంచేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా గుర్తించి వారికి రెమిడియల్ తరగతులు నిర్వహించాలన్నారు. కేవలం సిలబస్ పూర్తి చేయడానికే పరిమితం కాకుండా, ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలు స్పష్టంగా అర్థమయ్యేలా వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం నూరు శాతం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని, తరచూ బడికి రాని పిల్లల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పదో తరగతి వార్షిక బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో సన్నద్ధం చేయాలని, విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి ఉన్నత ఫలితాలు సాధించేలా దిశానిర్దేశం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) దర్శనం భోజన్న, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్



ఉట్నూర్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు)తెలంగాణ విశిష్ట సంస్కృతి, సనాతన సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ పిలుపునిచ్చారు. దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించు కుని గురువారం కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థినుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి పూలతో విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుక మ్మ ఉయ్యాలో' అంటూ విద్యార్థి నులు, మహిళా అధ్యాపకులు కలిసి ఆడుతూ పాడుతూ కోలాటాలు వేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం కల్పించడం వల్ల విద్యార్థుల్లో సమైక్యత, మానసిక ఉల్లాసం పెరుగుతా యన్నారు. విద్యార్థినులు తమ సంస్కృతిని భావితరాలకు సగర్వంగా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సాయిప్రసాద్, మహిళా అధ్యాపకులు డాక్టర్ రాణి, డాక్టర్ అనిత మరియు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవు: ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్

ఖానాపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):ఖానాపూర్ పురపాలక సంఘం పరిధిలో నిబంధనలకు విరుద్ధం గా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకో వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జారీ చేసిన ఆదేశాల మేరకు వార్డుల వారీగా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీ లు చేపట్టాలని స్పష్టం చేశారు. అనుమతు లు లేకుండా నిర్మిస్తున్న భవనాలు, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, నిర్దేశిత పరిమితికి మించి అదనపు అంతస్తుల నిర్మాణాలు మరియు రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కడుతున్న నిర్మాణాలను తక్షణమే గుర్తించాలన్నారు. అక్రమ నిర్మాణాలను ఫొటోలతో సహా రికార్డు చేసి నివేదికలను వెంటనే సమ ర్పించాలని వార్డు అధికారులను ఆదేశిం చారు. నిబంధనలు అతిక్రమించిన భవన యజమానులకు తక్షణమే స్టాప్ వర్క్ నోటీసులు జారీ చేసి పనులను నిలిపివేయాలని, లేనిపక్షంలో కూల్చివేత లు చేపడతామని స్పష్టం చేశారు. విధుల పట్ల అధికారులు ఏమాత్రం అలసత్వం వహించరాదని ఆయన ఆదేశించారు.

# ఖానాపూర్‌లో తాళం వేసిన ఆధార్ కేంద్రం.. ప్రజల తీవ్ర అవస్థలు



ఖానాపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ఆధార్ సేవా కేంద్రం తరచూ మూతపడుతుండటంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖానాపూర్ పట్టణంతో పాటు సమీపంలోని రాజూరా, పెంబి, దస్తురాబాద్, మస్తాపూర్, సుర్జాపూర్ తదితర గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది ప్రజలు ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు మరియు నూతన నమోదు కోసం ఇక్కడికి వస్తుంటారు. అయితే కేంద్రంలోని ల్యాప్‌టాప్ పనిచేయకపోవడం, ఇక్కడి బాధ్యతలను కడెం మండల అధికారికి అదనంగా అప్పగించడంతో ఆయన సకాలంలో అందుబాటులో ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి చంటిపిల్లలు, వృద్ధులతో వచ్చే ప్రజలు రోజంతా నిరీక్షించి నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. రానుపోను ప్రయాణ ఖర్చులు, తిండి ఖర్చులు భరించలేక సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక భారానికి గురవుతున్నారు. ప్రభుత్వ పథకాలు, రేషన్ కార్డులు, బ్యాంకు లావాదేవీలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి కావడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖానాపూర్‌లో ఆధార్ కేంద్రాన్ని నిరంతరం తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వంజర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ కాపీల అందజేత



సారంగాపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల పరిధిలోని వంజర్ గ్రామ పంచాయతీలో నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం అధికారిక ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందాల లచ్చవ్వ రమేష్, ఉపసర్పంచ్ నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని అర్హులైన పేద లబ్ధిదారులకు పత్రాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేద ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పూర్తి పారదర్శ కతతో ఇందిరమ్మ ఇళ్లను కేటాయిం చిందన్నారు. మంజూరైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా వెంటనే పునాది పనులు ప్రారంభించుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా ఇళ్లను నిర్మించుకోవాలని సూచిం చారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటే ప్రభుత్వ రాయితీ బిల్లులు వెంటనే అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, మాజీ ఆత్మ డైరెక్టర్ మహేష్ యాదవ్, వార్డు సభ్యులు గోనె శివ, మహేష్, కొత్తూరు ఎర్రన్న, కాంగ్రెస్ నాయకులు ముచర్ల రమణారెడ్డి, గోనె గంగాధర్ మరియు గ్రామ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం నిర్మల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నిర్మల్ టౌన్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు):ఆదివాసి నాయక్‌పోడ్ సేవా సంఘం నిర్మల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా కార్యదర్శి సొండి శివశంకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మేకల శంకర్ (నర్సాపూర్), జిల్లా అధ్యక్షుడిగా సాకి లక్ష్మణ్ (నిర్మల్), కార్యనిర్వాహక అధ్యక్షులుగా సార్ల నరసయ్య (ఖానాపూర్), రాజుల నారాయణ (నిర్మల్)లను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుంకరి ముత్యం (సోన్), కోశాధికారిగా గుంజర్ల సాయి (భైంసా), ఉపాధ్యక్షులుగా సుంచు శ్రీనివాస్, సుంచు నవీన్, ముచ్చిండ్ల రమేష్, లింగాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా దొడ్డిల శ్రీనివాస్, జంగిలి రాకేష్ ఎన్నికయ్యారు. సాంస్కృతిక కార్యదర్శిగా పోతరాజు శ్రీనివాస్, కార్యదర్శులుగా సుంచు సత్యనారాయణ, సురపు భోజన్న, గుమ్ముల శ్రీనివాస్‌లను నియమించారు. గౌరవ సలహాదారులుగా మంద మల్లేష్, సురపు సాయన్న, బండారి తక్కన్న, భోసాని రాజేశ్వర్‌లను నియమిం చారు. జిల్లాలోని ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని నూతన బాధ్యులు స్పష్టం చేశారు.

# పట్టణంలో ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు: రూ.7,000 జరిమానా




నిర్మల్ నిర్మల్ టౌన్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై నిర్మల్ పురపాలక సంఘం అధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు గురువారం పట్టణంలోని పలు వాణిజ్య సముదాయాలు, కిరాణా దుకాణాలు, హోల్‌సేల్ ప్లాస్టిక్ విక్రయ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్న పలువురు వ్యాపారులను గుర్తించి వారికి మొత్తం రూ.7,000 నగదు జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ నిర్మల్ పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. వ్యాపారులు, వినియోగదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి, వాటికి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జనపనార సంచులను మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించి రహస్యంగా ప్లాస్టిక్ విక్రయాలు సాగిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రజిని మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీవో గోవర్ధన్



అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని మండల పరిషత్ అధికారి (ఎంపీవో) గోవర్ధన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది హాజరు పట్టిక, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ మరియు నిత్యావసర సరుకుల నిల్వలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ నిబంధనల ప్రకారం నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వసతి గృహ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి స్వచ్ఛమైన తాగునీరు మాత్రమే సరఫరా చేయాలని వార్డెన్ అజయ్ కుమార్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణమే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU TGTEL/25/A0871

# జనరల్ న్యూస్



# అటవీశాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు

## రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎఫ్ఎస్వో

ఖానాపూర్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా ఖానాపూర్ అటవీశాఖ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం మెరుపు దాడులు నిర్వహించి ఓ అటవీ అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టణంలో టింబర్ డిపో నిర్వహణకు సంబంధించిన అధికారిక అనుమతి కోసం ఒక వ్యక్తి అటవీశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సదరు అనుమతి పత్రాలు ఇవ్వకుండా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్వో) రవీందర్ బాధితుడిని రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుతూ తీవ్ర మానసిక వేదనకు గురిచేశాడు. అనుమతి కావాలంటే మొదట రూ.20,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, అంత మొత్తం ఇచ్చుకోలేనని బాధితుడు బతిమాలడంతో చివరకు రూ.12,000 ఇచ్చేందుకు అధికారి అంగీకరించాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి పూర్తి వివరాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారుల పథకం ప్రకారం గురువారం ఖానాపూర్ అటవీశాఖ కార్యాలయంలో బాధితుడి నుంచి ఎఫ్ఎస్వో రవీందర్ రూ.12 వేల నగదు తీసుకుంటుండగా అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. రసాయన పరీక్షలు నిర్వహించి అధికారి చేతుల నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు.



అనంతరం ఎఫ్ఎస్వో రవీందర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు సూచించారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్: కలెక్టర్

నిర్మల్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మరింత సులభంగా, వేగంగా మరియు పారదర్శకంగా పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సరికొత్త ప్రత్యేక వాట్సాప్ గ్రీవెన్స్ సెల్‌ను అందుబాటులోకి



తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదుల కోసం ప్రయాణ భారాన్ని భరిస్తూ ప్రతిసారీ కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి వద్ద నుంచే నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ డిజిటల్ వ్యవస్థను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను వాట్సాప్ నంబర్ 8317557897 కు మెసేజ్ రూపంలో పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు పంపే సమయంలో సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలు, సమస్య ఉన్న గ్రామం, ప్రదేశం, ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌తో పాటు అవసరమైన రాతపూర్వక ఆధారాలు, ఫొటోలను జత చేయాలని సూచించారు. ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును కలెక్టరేట్‌లోని ప్రత్యేక ఐటీ బృందం నమోదు చేసుకుని వెంటనే సంబంధిత శాఖాధికారులకు పంపిస్తుందని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కార పురోగతిని తాను స్వయంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన అంశాలను మాత్రమే పంపాలని కోరారు. ఈ నంబర్ కేవలం వాట్సాప్ మెసేజ్‌ల కొరకు మాత్రమేనని, ఫోన్ కాల్స్ చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బాసరలో గోదావరి పుష్కరాల పనులపై కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉన్నత స్థాయి సమీక్ష

బాసర/నిర్మల్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలోని బాసర క్షేత్రంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ అత్యంత పకడ్బందీగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి (ఈవో) కార్యాలయంలో పుష్కర ఏర్పాట్ల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. బాసర క్షేత్రంలో గోదావరి నది తీరాన జరుగుతున్న స్నాన ఘాట్ల విస్తరణ, మెట్ల నిర్మాణం, రక్షణ గోడలు, విద్యుదీకరణ పనుల వివరాలను శాఖల వారీగా కలెక్టర్ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి తమ పరిధిలోని పనులను నిరంతరం క్షేత్రస్థాయిలోనే ఉంటూ పర్యవేక్షించాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



పుష్కరాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలకు దుస్తులు మార్చుకునే ప్రత్యేక గదులు, అత్యవసర వైద్య శిబిరాలు మరియు విశాలమైన వాహన పార్కింగ్ ప్రాంతాలను ముందస్తుగానే సిద్ధం చేయాలన్నారు. పుష్కర నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేసుకుని పనులు ప్రారంభించాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఉద్యానవన అధికారి రమణ, తహశీల్దార్ పవన్ చంద్ర, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు ఆపాలి

## ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నిరాహార దీక్ష

నిర్మల్ టౌన్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు గురువారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'బ్లాక్ డే' నిరసన మరియు నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాలతో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కూచాడి శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కల్పించాల్సిన రాజ్యాంగబద్ధమైన కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను అక్రమంగా తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ తప్పిదాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల హరీష్ కుమార్, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# నిర్మల్‌లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

## సినీనటి భాగ్యశ్రీ సందడి

నిర్మల్ టౌన్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): వస్త్ర వ్యాపార రంగంలో విశేష ఆదరణ పొందుతున్న ప్రముఖ సంస్థ మాంగళ్య షాపింగ్ మాల్ తన 34వ నూతన శాఖను నిర్మల్ పట్టణంలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బాలీవుడ్ ప్రముఖ సినీనటి భాగ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి భాగ్యశ్రీని చూసేందుకు పట్టణ నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం నటి భాగ్యశ్రీ మాట్లాడుతూ నిర్మల్ పట్టణ ప్రజలకు మెట్రో నగరాల తరహాలో అత్యాధునిక వస్త్ర ప్రపంచాన్ని, అద్భుతమైన కలెక్షన్లను మాంగళ్య అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే ఏలేటి



మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విస్తరిస్తున్న నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇలాంటి అంతర్జాతీయ స్థాయి మాల్ రావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి లభించడంతో పాటు ప్రజలకు పెళ్లిళ్ల షాపింగ్ కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ తప్పుతుందన్నారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాంగళ్య డైరెక్టర్లు కాసం నమశివాయ, మల్లికార్జున, కేదారినాథ్, శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు, పురుషులు, చిన్నారులకు రూ.99 నుంచి రూ.1 లక్ష వరకు అన్ని రకాల బడ్జెట్లలో సరికొత్త వస్త్ర శ్రేణిని సిద్ధం చేశామన్నారు. వివాహాలు, పండుగల సీజన్ దృష్ట్యా ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుసుమ వెంకట రత్నం బాబు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాలరాస్తే ఉద్యమం తప్పదు

## కాంగ్రెస్ దీక్షకు వామపక్షాల సంపూర్ణ మద్దతు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక ఓటు హక్కును కాపాడాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన నిరాహార దీక్షా



శిబిరాన్ని వామపక్ష పార్టీల ప్రతినిధులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొమ్మెన సురేష్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఫారం-6, ఓటర్ల జాబితా మార్పుల వ్యవహారంలో సుప్రీంకోర్టు ప్రమేయం ఏమీ లేదని భారత ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేసినప్పటికీ, ఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం శోచనీయమన్నారు. దేశంలో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్న తీరుపై ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికీ ఎలాంటి ఆటంకాలు లేకుండా ఓటు హక్కు కల్పించాలన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన రాహుల్ గాంధీతో పాటు వామపక్ష, విపక్ష జాతీయ నాయకులను కేంద్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా నిరసించారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె. రాజన్న, సీపీఐ(ఎంఎల్) పార్టీ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి. రమేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి తొడసం శంభు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి హరిత, టీయూసీఐ నాయకులు రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER